క్లుప్తంగా

ఆటపాటలతో వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులచే క్యారంబోర్డు ఆడిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కౌసల్య బుధవారం విద్యార్థులకు ఆటపాటలతో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు క్యారంబోర్డు, చెస్, రింగ్ ఆట, స్కిప్పింగ్ వంటి ఆటలు నిర్వహించారు. అనంతరం వారిచే నీతికథలు, జీవిత చరిత్రలు, స్వతంత్ర్య సమరయోధుల గురించిన విషయాలను తెలిపే పుస్తకాలను చదివించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించారు. ప్రతి రోజు ప్రతిఒక్కరు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాక్షిగణపతికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతం, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్ర స్వామి వారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం నగదును అధికారులకు అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం బనగానపల్లెకు చెందిన జి.లక్ష్మీదేవి రూ.1,00,000 విరాళం అందజేశారు. దాతలు విరాళాల కేంద్రంలోని అధికారులకు సొమ్ము అందజేశారు. నిర్వాహకులు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపిక, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

ఎమ్మెల్యే చొరవతోనే అభివృద్ధి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల అభివృద్ధి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితోనే సాధ్యమని మండల ముస్లిం మైనార్టీ కార్యదర్శి ఎమ్‌డి ఇస్మాయిల్ తెలిపారు. గత 60 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ లేక సున్నిపెంట గ్రామం అభివృద్ధికి నోచుకోలేకపోయిందని, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ప్రత్యేక చొరవతో శ్రీశైలం గ్రామాన్ని పంచాయతీ పరిపాలనకు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి జీఓ నంబర్ 40 ఉత్తర్వులను తీసుకొచ్చారన్నారు. ఈ జీఓ వల్ల గ్రామంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ భూమిపై యాజమాన్య హక్కులు సంక్రమించే అవకాశం ఉందని, అలాగే గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టే వీలుందని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ

మహానంది: ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించి చెట్లను పెంచడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని అటవీశాఖ నంద్యాల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుబ్బయ్య తెలిపారు. మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం మొక్కలు నాటించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ మేరకు డీఆర్‌ఓ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ నిర్మూలనకు నడుం బిగించాలన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్‌ను అరికట్టే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎఫ్‌బీఓ ప్రతాప్, ప్రిన్సిపాల్ అంబమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

శనగల బసవన్నకు పూజలు



శనగల బసవన్నకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి త్రయోదశి సందర్భంగా పరోక్ష సేవను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చన నిర్వహించి నానబెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యంగా సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

సకాలంలో నమోదు చేయకపోతే తిప్పలే

- జనన, మరణ వివరాలు 21 రోజుల్లో నమోదు చేసుకుంటే సులభం
- దాటితే రూ.50 చలానా చెల్లించి సర్టిఫికెట్ పొందొచ్చు
- ఏడాది గడిస్తే ఆర్డీఓ ప్రొసిడింగ్స్‌తో సర్టిఫికెట్ల జారీ
- 2016 నుంచి ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ సర్టిఫికెట్ల మంజూరు



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం

జూపాడుబంగ్లా: ఆధార్ కార్డు కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా, ఇలా ఏది కావాలన్నా జనన, మరణ ధ్రువపత్రాలు తప్పనిసరిగా మారాయి. 2009 కంటే ముందు జన్మించిన, మరణించిన వారి ధ్రువపత్రాలు ప్రస్తుతం పొందాలంటే ప్రజలు వారం రోజులపాటు సచివాలయం, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులున్నాయి. మొదట్లో పంచాయతీ, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రామాల్లో ఎవరైనా జన్మించినా, మరణించినా తేదీ, వివరాలు నమోదు చేసుకొనేవారు. ఆ తర్వాత వాటిని తహసీల్దార్ కార్యాలయంలో అందజేసేవారు. తద్వారా జనన, మరణ సర్టిఫికెట్లు పొందాలంటే గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు రికార్డులను పరిశీలించి ఒక్క రోజులోనే సర్టిఫికెట్లను మంజూరు చేసేవారు. 2009 వరదల్లో ఆర్డీఓ కార్యాలయం వరద నీటిలో మునిగిపోవడంతో కార్యాలయంలోని రికార్డులన్నీ కనుమరుగయ్యాయి. అప్పటినుంచి జనన, మరణ ధ్రువపత్రాలు పొందడం కొంత కష్టతరంగా మారింది. 2016 నుంచి జనన, మరణ ధ్రువపత్రాల జారీ ఆన్‌లైన్ కావడంతో 21 రోజుల్లోగా గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రాల్లో జనన, మరణ తేదీలను నమోదు చేయించుకొంటే పైసా ఖర్చులేకుండా సులభంగా సర్టిఫికెట్లు పొందవచ్చు. 21 రోజుల సమయం దాటిందంటే ఆన్‌లైన్‌లో జనన, మరణ తేదీలు నమోదు కావడం లేదు. దీంతో సర్టిఫికెట్ల మంజూరు కష్టసాధ్యమవుతుంది. దానికి కొంత వ్యయ, ప్రయాసాలకోర్చాల్సి ఉంటుంది.

తహసీల్దార్ అనుమతి తప్పనిసరి

21 రోజుల్లోగా జనన, మరణ తేదీలను నమోదు చేయించుకోకపోతే అనంతరం సర్టిఫికెట్లు కావాలంటే గ్రామ సచివాలయంలో నాన్ అవైలబుల్ (ఫారం 10) ఫారం ఇస్తారు. దాన్ని తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో రూ.50 చలానా చెల్లిస్తే తహసీల్దార్ జనన, మరణ సర్టిఫికెట్ల మంజూరు కోసం ప్రొసిడింగ్స్ ఇస్తారు. దాన్ని ఆధారంగా చేసుకొని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆన్‌లైన్‌లో జనన, మరణ తేదీలను నమోదు చేసుకొని సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు.

ఏడాది దాటితే ఆర్డీఓ అనుమతి

పుట్టిన, మరణించిన తేదీలు ఏడాది పైబడితే రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ప్రొసీడింగ్స్ పొందాల్సి ఉంటుంది. ముందుగా తహసీల్దార్ వద్ద నాన్‌అవైలబుల్ సర్టిఫికెట్ పొందటంతో పాటు రూ.50 చెలానా చెల్లించి ఆర్డీఓ కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంటుంది. అన్ని రికార్డులను పరిశీలించిన తర్వాత ఆర్డీఓ సర్టిఫికెట్ల జారీకి పంచాయతీ కార్యదర్శికి ప్రొసిడింగ్స్ ఇస్తారు. వాటి ఆధారంగా ధ్రువ పత్రాలు మంజూరు చేస్తారు. వీటన్నింటికీ కనీసం వారం నుంచి పక్షం రోజుల సమయం పడ్తుంది.

సకాలంలో వివరాలు నమోదు చేయించుకోవాలి



గ్రామాల్లో ఎవరైనా జన్మించినా, మరణించినా వారి కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాల్లో తేదీ, పేరు వివరాలు నమోదు చేయించుకోవాలి. 21 రోజుల్లోగా వివరాలు నమోదు చేయించుకొంటే ధ్రువపత్రాలు మంజూరు చేయడం సులభమతుంది. 21 రోజులు దాటితే ఆన్‌లైన్ ధ్రువపత్రాల మంజూరు కష్టమవుతుంది. ప్రొసీడింగ్స్ తీసుకొని దాన్ని అనుసరించి సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది.

– పుల్లయ్య, తహసీల్దార్, జూపాడుబంగ్లా

21 రోజులు దాటితే ఆన్‌లైన్ నమోదు కాదు



2016 నుంచి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారు. 21 రోజుల్లోగా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే ఆ తర్వాత వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కష్టమవుతుంది. కనుక గడువులోగా తప్పనిసరిగా జనన, మరణ తేదీలను నమోదు చేయించుకోవాలి. గడువు దాటితే తహసీల్దార్ ప్రొసీడింగ్స్ తీసుకొని సర్టిఫికెట్లు మంజూరు చేయాల్సి ఉంటుంది.

– మంజులవాణి, ఎంపీడీఓ, జూపాడుబంగ్లా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డు (పంట సాగు హక్కు పత్రం)లను పొందాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. రైతుల నుంచి పొలాలు కౌలుకు తీసుకున్న రైతులు సీసీఆర్‌సీ పత్రాలను పొందితేనే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా, పంట నమోదు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ఇందుకోసం రైతులు పొలాన్ని కౌలుకు తీసుకున్న అగ్రిమెంట్, ఆధార్ కార్డు, పాస్‌ఫొటో, భూ యజమానికి చెందిన వన్‌బీ ఫారం తదితర జిరాక్స్ కాపీలను తీసుకుని సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ముగ్గురు టీఏలు, సీఓ బదిలీ

జూపాడుబంగ్లా: రేషనలైజేషన్‌లో భాగంగా మండలానికి ముగ్గురు టీఏలు మాత్రమే ఉండాలనే నిబంధనల మేరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ముగ్గురు టీఏలను బదిలీ చేశారు. కార్యాలయంలో ఐదుగురు టీఏలు, ఓ బీఎఫ్‌టీ విధులు నిర్వర్తిస్తున్నారు. మండలానికి ముగ్గురు టీఏలు మాత్రమే ఉండాలనే నిబంధనల మేరకు టీఏ, కంప్యూటర్ ఆపరేటర్‌ను విజయనగరం బదిలీచేశారు. అలాగే మరో ఇద్దరు టీఏలను ఆత్మకూరు, వెలుగోడు మండలాలకు బదిలీచేశారు. ప్రస్తుతం ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీఓతోపాటు ముగ్గురు టీఏలు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం



భారీ జనసందోహం మధ్య వస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

- పండుగలా గడప గడపకు మన ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమం
- బండిఆత్మకూరులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి భారీ స్వాగతం

మహానంది: జగనన్న అంటే అభిమానం, ఎమ్మెల్యే శిల్పాను మనసులో పెట్టుకున్న పల్లె జనం బుధవారం ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. వేలాది సంఖ్యలో తరలివచ్చి గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) వంద రోజుల కార్యక్రమాన్ని పండుగ చేశారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేపట్టిన జీజీఎంపీ కార్యక్రమం బుధవారం బండిఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రవేశించడంతో భారీ గజమాలలు, పూల వర్షంతో ప్రేమపూర్వక స్వాగతం పలికి కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర రెడ్డితో కలిసి బండిఆత్మకూరులో ఇంటింటికీ తిరిగి పేదల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారథి, పేదల కష్టాలు తెలిసిన సీఎం జగనన్నతోనే పేదల సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తూ పేదల గుండెల్లో నిలిచిన జగనన్నకే మా ఓటు, మళ్లీ మాకు ఆయనే ముఖ్యమంత్రిగా రావాలి, మా బిడ్డలను చదివించాలంటూ ప్రజలు ఆప్యాయంగా చెబుతున్నారన్నారు. ఇంతటి ప్రేమను పొందిన జగనన్న ఆశయాలే తమకు ఆదర్శమన్నారు. ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు దేసు వెంకట్రామిరెడ్డి, ముడిమెల పుల్లారెడ్డి, సుజాతమ్మ, అవుటాల నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, దీపకాంత్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పరమటూరు శివలింగం, మహేశ్వరరెడ్డి, సంధ్య, శ్రీరామ్‌రెడ్డి, ముంతల మధురాణి, పుల్లయ్య, పాల్గొన్నారు.

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చేపట్టిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం వంద రోజులు పూర్తయిన సందర్భంగా మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఎంపీపీ లాలం రమేష్, నాయకులు ముంతల విజయ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు తదితరులు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.



తంగడంచ చెక్‌పోస్టు వద్ద పిచ్చిమొక్కలతో అల్లుకపోయిన గాలి కొలమాన పరికరం



రామసముద్రం చౌరస్తా వద్ద నిరుపయోగంగా మారిన గాలికొలమాన కేంద్రం

'గాలి'కొదిలేశారు

జూపాడుబంగ్లా: ప్రకృతి వైపరీత్యాలు సంభవించడానికి ముందే వాతావరణ శాఖ నిపుణులు ఆధునిక యంత్ర పరికరాలతో వాటిని కనిపెట్టి హెచ్చరికలు జారీ చేస్తుంటారు. అందులో భాగంగా మండలంలోని రామసముద్రం చౌరస్తా వద్ద, పారుమంచాల, జూపాడుబంగ్లా విద్యుత్ కేంద్రాలతోపాటు తంగెడంచ చెక్‌పోస్టు వద్ద గాలి కొలమాన కేంద్రాలను వాతావరణ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. వాటికున్న చిప్స్, మెమోరీ కార్డులు, గాలితీవ్రతను రికార్డు చేసే పరికరాలు సక్రమంగా పనిచేయకపోవడంతో అవి కాస్త నిరుపయోగంగా మారాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఏ సమయంలో ఎంత ఉధృతమైన గాలి వీచింది తద్వారా ఎంత నష్టం వాటిల్లి ఉండొచ్చు, ఎంత వర్షపాతం నమోదైంది అనే వివరాలు సమగ్రంగా జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు రికార్డు చేయలేకపోతున్నారు. మే, జూన్ మాసాల్లో అధికంగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో గాలితీవ్రత ఎంత, ఎంత వర్షపాతం నమోదైంది, అనే వివరాలు సమగ్రంగా తెలియాలంటే గాలికొలమాన, వర్షపాత నమోదు కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి

నందికొట్కూరు రూరల్: గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ మన్‌జీర్ జిలానీ శామూన్ మండల స్థాయి అధికారులకు సూచించారు. ఆయన బుధవారం జిల్లా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలో జరుగుతున్న నాడు – నేడు పనులు, జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాల పనుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని నాడు – నేడు పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. పనులు నాసిరకంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈఓఆర్డీ సుబ్రమణ్యశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధురి, పీఆర్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ అలివేలు మంగమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

మహానంది: బుక్కాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన జమాల్‌బాషా పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కల్లంలో నిల్వ ఉంచుకున్న వరిగడ్డి వాములకు బుధవారం నిప్పంటుకుని అగ్నికి ఆహుతయ్యాయి. నంద్యాల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినా అప్పటికే సర్వం అగ్నికి ఆహుతి కావడంతో రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

బండిఆత్మకూరులో నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మహానంది: బండిఆత్మకూరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు కొనసాగుతుందని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నందికొట్కూరు: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బొలెరా వాహనంలో 16 బస్తాల (40 కేజీల ప్యాకెట్లు) రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ వాహనం, రేషన్ బస్తాలతో పాటు నిందితులు రాముడు, చరణ్, శశికుమార్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనం సీజ్ చేసి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు



తాటిపాడులో కల్లుదుకాణం నుంచి శ్యాంపిల్ సేకరిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమీషనర్

జూపాడుబంగ్లా: జిల్లాలో ఎక్కడైనా కల్తీ కల్లు విక్రయించినట్లు తెలిస్తే దుకాణదారులపై కఠినచర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ వివేక్ హెచ్చరించారు. ఆయన బుధవారం ఆయన మండలంలోని 80బన్నూరు, చాబోలు, తరిగోపుల, తాటిపాడు, జూపాడుబంగ్లా తదితర గ్రామాల్లోని కల్లు దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల లైసెన్స్‌లను పరిశీలించి కాలపరిమితి ముగిసిన వాటిని రెన్యువల్ చేయించుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. దుకాణాల్లో విక్రయిస్తున్న కల్లు శ్యాంపిల్ సేకరించారు. ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ గడువు ముగిసిన దుకాణాలను ఐదేళ్ల పాటు రెన్యూవల్ చేసినట్లు తెలిపారు. సేకరించిన శ్యాంపిల్‌ను ల్యాబ్‌కు పంపి వాటిలో ఏమైనా నిషేధిత రసాయనాలు కలిపారా? అని పరీక్షిస్తామన్నారు. కల్లు విక్రయదారులకు అల్లూరు సమీపంలోని ఈతతోపు వనాలను కేటాయించి తద్వారా సేకరించిన కల్లును విక్రయించుకునేలా చేశామన్నారు. ఎవరైనా కృత్రిమ కల్లును తయారుచేసినా, విక్రయించినా, రసాయనాలు కలిపి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ కృష్ణకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రామచంద్రుడు, కల్పన పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



బోరును పరిశీలిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: హఠకేశ్వరం చెంచు గిరిజన గూడెంలో గత కొద్ది రోజులుగా నీటి సరఫరా లేక గిరిజనులు తాగునీటికి పలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి గూడెంను సందర్శించారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో మోటార్లు పనిచేయడం లేదని గుర్తించి ఏపీఎస్‌పీడీసీఎస్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బోరును వినియోగంలోకి తెచ్చి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. మరో బోరుకు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.త్వరలోనే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పీఓ రవీంద్రారెడ్డి చెంచు గిరిజనులకు తెలిపారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇలియాస్‌ఖాన్ తదితరులు

వెలుగోడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనారిటీల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే యూనుస్‌బాషా, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్ కొనియాడారు. హజ్ యాత్రికులకు రూ.14.51 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇలియాస్‌ఖాన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న మైనారిటీలకు అదనంగా అయ్యే ఖర్చు రూ.14.51 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక ఆర్థిక సహాయం కింద యాత్రికుల ఖాతాలో జమ చేయడం గొప్ప విషయమన్నారు. పవిత్ర హజ్ యాత్రను కూడా ప్రతిపక్షాలు రాజకీయం చేయడం హేయమని ఆయన మండిపడ్డారు. ఇటీవల ఆత్మకూరులో లోకేష్ నిర్వహించిన యువగళం సభలో మైనారిటీ నాయకుడు అహ్మద్ హుస్సేన్‌ను కిందకు దించడంతో టీడీపీ మైనారిటీలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఆ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జబివుల్లా, నాయకులు ఆరిఫ్, ఆసీఫ్, వలి, అన్సర్, నూర్ అహ్మద్, పాల్గొన్నారు.

హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయండి



హౌసింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈ ప్రభాకర్

పగిడ్యాల: నిర్ణీత గడువులోగా హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయించాలని నందికొట్కూరు హౌసింగ్ డివిజనల్ ఇంజినీర్(డీఈఈ) ప్రభాకర్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్, లక్ష్మాపురం, ఘణపురం గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి పట్టాలు మంజూరు చేసి నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్నా పురోగతి మందకొడిగా ఉందన్నారు. మండలవ్యాప్తంగా 194 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వాటిని నెల రోజుల్లో పూర్తి చేయించేందుకు కృషి చేయాలన్నారు. వారానికి 35 చొప్పున ఇళ్లను పూర్తి చేయించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

జూపాడుబంగ్లా: చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకుగాను ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ఏపీఓ గౌరీబాయి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ అసైన్డ్ భూములు కలిగిన గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతుల పేరిట పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉండాలని, గతంలో ఉపాధిహామీ పథకం, షెర్ప్, ఉద్యాన శాఖల ద్వారా లబ్ధి పొంది ఉండరాదన్నారు. ఐదెకరాల్లోపు పొలం కలిగి ఉండి జాబ్‌కార్డుతో పాటు, బోర్లు, బావులు, చెరువులు, సాగునీటి కాల్వలున్న రైతులు పండ్ల తోటలను సాగుచేసుకోవచ్చునన్నారు. మామిడి, సపోట, చీని, జామ, నిమ్మ, నేరేడు, కొబ్బరి, సీతాఫలం, చింత, డ్రాగన్‌ఫ్రూట్స్, మల్లె, గులాబి, మునగ, దానిమ్మ, ఆపిల్, రేగు తదితర పండ్ల తోటలను సాగుచేసుకోవచ్చునన్నారు. సాగుచేసుకొనే తోటను బట్టి ఎకరాకు 20 నుంచి 500 మొక్కల దాకా సరఫరా చేస్తామన్నారు. తోటలకు మూడేళ్ల కాలపరిమితికి గాను ఎకరాకు రూ.44,568 నుంచి రూ.1,84,533 వరకు మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేయనున్నట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, బ్యాంకు పుస్తకం జిరాక్సు పత్రాలను తీసుకొచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీఓ తెలిపారు.

ముమ్మరంగా సామాజిక తనిఖీ



ఉపాధి పనుల తనిఖీ నిర్వహిస్తున్న డీఆర్పీ

కొత్తపల్లి: మండలంలో 2022–2023 సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీ మొదలైంది. బుధవారం ఎస్‌ఆర్పీ మణికంఠ ఆధ్వర్యంలో డీఆర్పీలు మండలంలోని పెద్దగుమ్మడాపురం, నందికుంట, జీ.వీరాపురం, ముసలిమడుగు, గోకవరం, దుద్యాల గ్రామాలలో తనిఖీ చేపట్టారు. నేరుగా పనులు జరుగుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి మరి కూలీలతో సమాచారం సేకరిస్తూ తనిఖీలు చేస్తున్నారు. కొలతలు, మస్టర్ పరిశీలన వంటివి కరెక్ట్‌గా జరుగుతుందా లేదా అని పక్కా సమాచారాన్ని సేకరిస్తున్నారు. నేడు సామాజిక తనిఖీ పూర్తయ్యే గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి సేకరించిన సమాచారాన్ని ప్రజలు, ప్రజా ప్రతినిధుల ఎదుట చదివి వినిపిస్తారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణ పూజలందుకుంటున్న మహానందీశ్వర ఉత్సవమూర్తులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లకు బుధవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతి పూజ, అలంకరణ, అక్షింతల సమర్పణ, మాంగల్యధారణ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో జరిగిన కల్యాణోత్సవ పూజలను భక్తులు తిలకించారు. పూజల అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎంఎస్‌పీ గ్రామ కమిటీల ఎన్నిక

వెలుగోడు: ప్రతి ఊరిలో మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జెండా ఎగరాలన్నదే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు వాదం నాగోషలు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని మోత్కూరు, అబ్దుల్లాపురం గ్రామాల్లో మహాజన సోషలిస్టు పార్టీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.